సాక్షి
శ్రీకాకుళం
శనివారం । 27 । జనవరి । 2024



ప్రతిభకు ప్రశంసలు

ఉత్తమ ఉద్యోగులు ప్రశంసా పత్రాలు అందుకున్నారు. గణతంత్ర వేడుకల్లో వారికి అవార్డులు అందజేశారు. - 8లో



రోడ్డు ప్రమాదంలో..

రోడ్డు ప్రమాదంలో ట్రాక్టర్ డ్రైవర్ మృతి చెందాడు. మడపాం వద్ద ప్రమాదం జరిగింది. - 8లో

అజ్జరాం మహిళ బైక్ విన్యాసాలు



ఎచ్చెర్ల క్యాంపస్: అజ్జరాం గ్రామానికి చెందిన గేదెల భాగ్యలక్ష్మి గణతంత్ర వేడుకల్లో బైక్ విన్యాసాలతో అదరగొట్టారు. ఈమె న్యూ ఢిల్లీలో సీఆర్‌పీఎఫ్ విభాగంలో పని చేస్తున్నారు. ఢిల్లీలో గురువారం సీఆర్పీఎఫ్ బృందం బైక్ విన్యాసాలు నిర్వహించగా, ఈ బృందంలో ఆమె కూడా పాలుపంచుకున్నారు.

న్యూస్‌రీల్

హౌసింగ్ డీఈఈకి పురస్కారం



లక్ష్మిషా చేతులమీదుగా ప్రశంసాపత్రం అందుకుంటున్న డీఈఈ నర్సింగరావు

పాతపట్నం: పాతపట్నం గృహ నిర్మాణ శాఖలో డీఈఈగా పనిచేస్తున్న వి.నర్సింగరావు విధి నిర్వహణలో ఉత్తమ సేవలందించినందుకు గాను రిపబ్లిక్ డే సందర్భంగా శుక్రవారం విజయవాడలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గృహనిర్మాణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ లక్ష్మిషా చేతుల మీదుగా పురస్కారం అందుకున్నారు. ఈ సందర్భంగా పలువురు అభినందించారు.

గవర్నర్‌తో మిట్టుమహాపాత్రో



విజయవాడ రాజ్‌భవన్‌లో గవర్నర్ అబ్దుల్ నజీర్‌తో మిట్టు మహాపాత్రో

పాతపట్నం: పాతపట్నం ప్రభుత్వ పాఠశాలలో చదివి పదో తరగతిలో 600కు 594 మార్కులు సాధించిన మిట్టు మహాపాత్రో గవర్నర్‌తో తేనీటి విందుకు హాజరయ్యాడు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా శుక్రవారం విజయవాడలోని రాజ్‌భవన్‌లో నిర్వహించిన ఎట్ హోమ్ కార్యక్రమంలో గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్‌తో కలిసి తేనీటి విందుకు హాజరయ్యాడు. రాజ్‌భవన్ నుంచి పిలుపు రావడంతో వెళ్లినట్లు మిట్టు చెప్పాడు.

గణతంత్ర వేడుకల్లో కూన శ్రీలత ప్రదర్శన



ఆమదాలవలస: న్యూఢిల్లీలో నిర్వహించిన గణతంత్ర వేడుకల్లో ఆమదాలవలస పట్టణానికి చెందిన కూన శ్రీలత కూచిపూడి నృత్యం ప్రదర్శించింది. ఆమె కూచిపూడి నృత్య విశ్వ విద్యాలయంలో ప్రస్తుతం పోస్టు గ్రాడ్యుయేషన్ చేస్తున్నారు. అక్కడి నాట్యాచార్యులు డాక్టర్ యేలేశ్వరపు శ్రీనివాసులు నృత్య సారథ్యంలో ఈ ప్రదర్శనకు ఎంపికైంది.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



సోంపేట: మండలంలోని పాలవలస జాతీయ రహదారి వద్ద శుక్రవారం ఉదయం జరిగిన రహదారి ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందినట్లు బారువ ఎస్ఐ చిరంజీవి తెలిపారు. బారువ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గురువారం అర్ధరాత్రి 12 గంటల నుంచి శుక్రవారం ఉదయం 6 గంటల మధ్య ఏదో వాహనం ఢీ కొట్టడంతో 50-60 ఏళ్ల వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయని, ఉదయం ఆయనను హరిపురం సామాజిక ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స చేయిస్తుండగా చనిపోయారని తెలిపారు. బారువ ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'దివ్యాంగులను ఆదుకుంటాం'



మాట్లాడుతున్న ట్రస్టు వ్యవస్థాపకులు

నరసన్నపేట: దివ్యాంగులకు అన్ని విధాలా సహాయ సహకారాలు అందించి వారిని ఆదుకుంటామని గురుదేవ్ చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకులు జగదీశ్వరరావు అన్నారు. మండలం తామరాపల్లి సమీపంలోని స్పిన్నింగు మిల్లు ప్రాంతంలో దివ్యాంగులకు ఉచితంగా పరికరాలు సరఫరా చేసేందుకు శుక్రవారం సమావేశం నిర్వహించారు. శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలకు చెందిన 400 మందికి పైగా దివ్యాంగులు కార్యక్రమంలో పాల్గొన్నారు. వారికి ఏయే పరికరాలు అవసరం, వారి జీవనోపాధికి ఎలాంటి సాయం అవసరమో రికార్డు చేశారు. ఎస్.కోట వద్ద మంగళపాలేంలో తమ ట్రస్టు ఉందని అన్నారు. 2005 నుంచి దివ్యాంగులను ఆదుకుంటున్నామని, 2018 నుంచి సేవలు విస్తృతం చేశామని తెలిపారు. అలాగే దివ్యాంగులకు అవసరమైన ఏ పరికరం అయినా ఉచితంగా ఇస్తామని, ఆర్థిక స్థోమత కలిగిన వారు 50 శాతం డబ్బులు పెట్టుకోగలిగితే మరింత నాణ్యమైన పరికరాలు ఇస్తామన్నారు. ఈ నిధులు మిగిలిన దివ్యాంగుల పరికరాల తయారీకి ఉపయోగపడతాయన్నారు. ఊణ్ణ సాయి కుమార్, దాసరి ఆదినారాయణ, ఇట్రాజు హరి, పట్ట చిన్నబాబు, శ్రీనువాసు తదితరులు సహకారంతో సమావేశం నిర్వహించారు.

గణతంత్రమే.. జనమంత్రమై



ఆర్ట్స్ కళాశాల మైదానంలో జాతీయ పతాకానికి సెల్యూట్ చేస్తున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్, ఎస్పీ రాధిక తదితరులు

పరిఢవిల్లుతున్న ప్రజాస్వామ్యానికి సాక్షిగా మువ్వన్నెల జెండా సమున్నతంగా ఎగిరింది. పల్లవిస్తున్న ప్రజా సంక్షేమానికి నిదర్శనంగా శకటాలు సగౌరవంగా తిరిగాయి. పరుగులు పెడుతున్న ప్రగతికి సంకేతంగా ప్రసంగాలు ప్రతిధ్వనించాయి. గణతంత్ర వేడుక ఘనమైన రీతిలో జరిగింది. ప్రదర్శనల నుంచి ప్రసంగాల వరకు, శకటాల నుంచి స్టాళ్ల వరకు, వేదిక నుంచి వేషధారణల వరకు అణువణువునా దేశభక్తి ప్రతిబింబించింది.

- ఘనంగా 75వ గణతంత్ర వేడుక
- జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్
- అలరించిన శకటాలు, స్టాళ్లు



స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబసభ్యులకు సత్కారం



భరత మాత వేషధారణలో చిన్నారి

శ్రీకాకుళం పాతబస్టాండ్, శ్రీకాకుళం పీఎన్ కాలనీ : జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కాలేజీ మైదానంలో శుక్రవారం 75వ గణతంత్ర వేడుకలు వైభవంగా నిర్వహించారు. కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ జాతీయ జెండాను ఎగురవేశారు. అనంతరం ఆయన ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. కార్యక్రమంలో కోటబొమ్మాళి మండలం, తిలారు గ్రామానికి చెందిన స్వాతంత్ర్య సమర యోధురాలు మంత్రి అప్పల రామయ్య భార్య అప్పలనరసమ్మను దుశ్శాలువతో సత్కరించారు. అనంతరం ఉత్తమ సేవలు అందించిన అధికారులకు అవార్డులు ప్రదానం చేశారు.

అలరించిన స్టాల్స్

రవాణా, మత్స్య, వ్యవసాయ, పశుసంవర్ధక, విద్య, మహిళ, శిశు అభివృద్ధి సంస్థ, విపత్తు స్పందన, అగ్నిమాపక, నీటిపారుదల, ఉద్యాన శాఖ, గిరిజన సహకార సంస్థ, సీతంపేట సేంద్రియ అటవీ వ్యవసాయ ఉత్పత్తులు, జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్ స్టాల్స్ అందరినీ అలరించాయి. అలాగే శకటాల ప్రదర్శన జిల్లా ప్రగతిని చాటి చెప్పాయి. స్త్రీ శిశు సంక్షేమశాఖ సంక్షేమ శాఖ శకటానికి మొదటి స్థానం, గ్రామీణ అభివృద్ధి సంస్థ శకటానికి ద్వితీయ స్థానం, జిల్లా నీటి యాజమాన్య సంస్థ తృతీయ స్థానం కైవసం చేసుకున్నాయి.

ఉత్సాహంగా సాంస్కృతిక కార్యక్రమాలు

తిమ్మరాజు నీరజా సుబ్రమణ్యం, శ్రీకాంత్ ఆధ్వర్యంలో జరిగిన నృత్య ప్రదర్శనలు అలరించాయి. అలాగే వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు నృత్య ప్రదర్శన చేశారు. వీరిలో శ్రీకాకుళం న్యూ సెంట్రల్ స్కూల్ మొదటి బహుమతి, శ్రీకాకుళం సాంఘిక సంక్షేమ పాఠశాలకు ద్వితీయ స్థానం, పోలాకి కేజీబీవీకి మూడో స్థానం దక్కాయి. కార్యక్రమంలో సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ జీఆర్ రాధిక, జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, సీతంపేట ఐటీడీఏ పీఓ కల్పనా కుమారి, అసిస్టెంట్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, సెబ్ ఎస్పీ ఎన్‌వీ మణికంఠ, నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్, ఏఎస్పీ తిప్పే స్వామి, టెక్కలి సబ్ కలెక్టర్ నూరుల్ అహ్మద్, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు, డివిజనల్ రెవెన్యూ అధికారి సీహెచ్ రంగయ్య, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, స్వచ్ఛంద సంస్థలు, పలు పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



అందరి సహకారంతో సర్వతోముఖాభివృద్ధి

- గణతంత్ర వేడుకల్లో కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్



మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: ప్రభుత్వ సంక్షేమాలను ప్రజలకు అందించి వారి సర్వతోముఖాభివృద్ధికి మనం అడుగులు వేస్తున్నామని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ అన్నారు. వారసత్వ ఫలాలు అందరికీ అందాలన్నారు. 75వ గణతంత్ర వేడుకలు శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఆర్ట్స్ కాలేజీ మైదానంలో ఘనంగా జరిగాయి. కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని ప్రసంగించారు.

జిల్లాలో 2,65,823 ఎకరాల ఆయకట్టుకు సాగు నీరు అందజేస్తున్నట్లు వివరించారు. ప్రభుత్వం వ్యవసాయానికి పెద్దపీట వేస్తోందని చెప్పారు. జిల్లాలో 656 రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు విత్తనాలు, ఎరువులు, పంట కొనుగోలుతో పాటు ఇతర సేవలు అందించామని, రూ.369 కోట్ల మేర రైతు భరోసాగా అందజేశామని చెప్పారు. జిల్లా వ్యాప్తంగా 583 రైతు భరోసా కేంద్రాల ద్వారా 371 కొనుగోలు కేంద్రాల్లో 3,70,086 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని 79,177 రైతుల వద్ద నుంచి కొనుగోలు చేసి రూ.618.38 కోట్లు అందజేశామన్నారు. 2023-24 సంవత్సరంలో మత్స్యకారులకు వేట నిషేధ సమయంలో మర, సంప్రదాయ పడవలకు రూ.15.28 కోట్ల ఆర్థిక సాయాన్ని జమ చేశామని తెలిపారు. ఉద్దానం తాగునీటి పథకం కింద ఇచ్ఛాపురం, పలాస నియోజకవర్గాల్లో 807 గ్రామాలకు రూ.700 కోట్లతో ప్రాజెక్టు నిర్మించామన్నారు. ఈ పథకం ద్వారా 7 మండలాలకు సంబంధించి అన్ని గ్రామాల్లో ప్రతి ఇంటికి తాగునీరు సరఫరా చేసేందుకు కమ్యూనిటీ కాంట్రాక్టింగ్ పద్ధతిలో మార్చి-2024 నాటికి తాగునీరు అందించేందుకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. జల జీవన్ మిషన్ ద్వారా ఇప్పటి వరకు 2,15,034 గృహాలకు తాగునీరు అందజేశామన్నారు. ఆరోగ్య శ్రీ ద్వారా 3257 రకాల వ్యాధులకు ఈ ఆర్థిక సంవత్సరంలో జిల్లాలో 81,582 మందికి శస్త్ర చికిత్సలకు రూ.158.08 కోట్లు ప్రభుత్వం చెల్లించిందని పేర్కొన్నారు. నవరత్నాల్లో భాగంగా జిల్లాలో 75,840 గృహాలు మంజూరు కాగా 74,191 గృహాలు ప్రారంభించి ఇంత వరకు 33,422 గృహాలు పూర్తి చేశామన్నారు. వైఎస్సార్ రూరల్ హౌసింగ్‌లో 55,619 గృహాలు మంజూరు కాగా.. 34,352 గృహాలు పూర్తి చేసి రాష్ట్ర స్థాయిలో జిల్లా 3వ స్థానంలో నిలిచామన్నారు. ఇతర అభివృద్ధిని కలెక్టర్ వివరించారు.



ప్రథమ బహుమతి పొందిన ఐసీడీఎస్ శకటం



ద్వితీయ బహుమతి పొందిన డీఆర్‌డీఏ శకటం



తృతీయ బహుమతి పొందిన డ్వామా శకటం



వందనమన్నా రైతన్న నృత్యప్రదర్శన చేస్తున్న న్యూసెంట్రల్ స్కూల్ విద్యార్థినులు



ఐటీడీఏ పోస్ట్ మెట్రిక్ బాలికలు ప్రదర్శించిన థింసా నృత్యం



పోలాకి కేజీబీవీ విద్యార్థినుల దేశ్ రంగీలా నృత్యం

అడుగులన్నీ అటువైపే..

- భీమిలి సభకు సిద్ధమైన వైఎస్సార్ సీపీ క్యాడర్



సంగివలసలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న తలశిల రఘురాం

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం: విశాఖపట్టణం భీమిలిలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో మారుమోగనున్న ఎన్నికల శంఖారావానికి వైఎస్సార్‌సీపీ కేడర్ సిద్ధమైంది. ఎన్నికలకు 'సిద్ధం' కావాలంటూ అధినేత ఇచ్చిన పిలుపును అందుకుని ఉత్తరాంధ్రలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానుల్లో నూతన ఉత్తేజంతో భీమిలి బయల్దేరారు. భీమిలిలోని సంగివలస వద్ద అనిట్స్ కళాశాల మైదానంలో శనివారం 'సిద్ధం' నినాదంతో భారీ ఎత్తున బహిరంగ సభను నిర్వహించనున్నారు. జిల్లాలోని వైఎస్సార్ సీపీ నాయకులతో పాటు క్యాడర్ అంతా సభకు హాజరుకావడానికి ఉవ్విళ్లూరుతోంది. నాయకులు, ప్రజా ప్రతినిధులు ఏర్పాట్లలో తలమునకలయ్యారు. 175 సీట్లు కైవసం చేసుకోవడమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్ దిశానిర్దేశం చేయనుండడం, రాష్ట్రంలోనే తొలిసభ కావడం, లక్షలాది మంది రానుండడంతో ప్రాధాన్యత సంతరించుకుంది.



సంగివలసలో అనిట్స్ కళాశాల ఆవరణలో ముస్తాబవుతున్న సభా ప్రాంగణం

చిన్నారులకు ఆర్థిక సాయం



చిన్నారులకు నగదుతో పాటు నిత్యావసర సరుకులు అందిస్తున్న దృశ్యం

సాక్షి ఎఫెక్ట్...

ఇచ్ఛాపురం రూరల్: తేలుకుంచి గ్రామం కొత్తవీధికి చెందిన వెంకటలక్ష్మి ఇటీవల ఆత్మహత్య చేసుకుంది. దీంతో ఇద్దరు కుమార్తెలు శరణ్య, లిఖిత అనాథలుగా మిగిలారు. వీరిని దాతలు ఆదుకోవాలని 'సాక్షి'లో 'అమ్మలేదు-నాన్న రాడు' శీర్షికతో ప్రచురించిన కథనానికి దాతలు స్పందించారు. శుక్రవారం మండలానికి చెందిన కార్మిక శాఖ ఫౌండేషన్ రూ. 12వేలు నగదుతో పాటు దశదిన కర్మలకు అవసరమైన నిత్యావసర సరుకులు అందజేశారు. జగన్నాథపురం గ్రామానికి చెందిన 'స్పందన చలించే హృదయం' ఫౌండేషన్ తరఫున రూ. 6000 నగదును సర్పంచ్, వైఎస్సార్ సీపీ కన్వీనర్ పాతిర్ల రాజశేఖర్ రెడ్డి చేతుల మీదుగా అందజేశారు.

వైఎస్సార్‌సీపీలోకి పలువురి చేరిక

సోంపేట: వైఎస్సార్‌సీపీలో చేరికలు జోరందుకుంటున్నాయి. సోంపేట మండలంలోని తాళబద్ర, సిరిమామిడి పంచాయతీల్లో పలువురు టీడీపీ నాయకులు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ, మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్ సమక్షంలో శుక్రవారం వైఎస్సార్‌సీపీలో చేరారు. సిరిమామిడి పంచాయతీ ఎర్రముక్కాం గ్రామానికి చెందిన బైపల్లి మన్మధరావు, కొండా రవి, దున్న ఈశ్వరరావు, గోవింద్, మేఘనాథంతో పాటు మరో పది కుటుంబాలు పార్టీలో చేరా యి. తాళభద్ర పంచాయతీ రాణిగాం గ్రామంలో మద్దు సుందరరావు, కర్రినేని భీమ్‌రాం, పున్నేడుతో పాటు గా మరో 8 కుటుంబాల సభ్యులు పార్టీలో చేరారు. వారికి పార్టీ సమన్వయకర్త పిరియా విజ య, పిరియా సాయిరాజ్‌లు పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో సోంపేట, కంచిలి ఎంపీపీలు డాక్టర్ నిమ్మన దాస్, పైల దేవదాస్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు శిలగాన భాస్కరరావు, జేసీఎస్ కన్వీనర్ బుద్ధాన శ్రీకృష్ణ, సర్పంచ్ ఉగ్రపల్లి శారద, బైపల్లి ఈశ్వరి, ఉగ్రపల్లి తిరుపతిరావు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలోకి జనసేన వీర మహిళ

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీకి చెందిన జనసేన నాయకురాలు సుజాత పండా వైఎస్సార్ సీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఆమె గత ఎనిమిదేళ్లుగా జనసేనలో ఉన్నారు. శుక్రవారం ఆమెను మంత్రి సీదిరి అప్పలరాజు పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. ఆమెతోపాటు భర్త శ్రీనివాసరావు సైతం కండువా వేసుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గిరిబాబు, వైస్ చైర్మన్‌లు బోర కృష్ణారావు, మీసాల సురేష్‌బాబు, ప్రభుత్వ విప్ శంకర్‌పండా, సీహెచ్‌సీ చైర్మన్ డబ్బీరు భవానీశంకర్, వాణిజ్య విభాగ చైర్మన్ బెల్లాల శ్రీనివాసరావు, గౌరీ త్యాడి, బళ్ల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



ఎర్రముక్కాంలో పార్టీలో చేరిన వారికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న సాయిరాజ్



రాణిగాంలో పార్టీలో చేరిన వారికి కండువాలు వేసి ఆహ్వానిస్తున్న పిరియా విజయ



మంత్రి అప్పలరాజు సమక్షంలో చేరిన జనసేన వీరమహిళ సుజాత పండా

ప్రతిభకు ప్రశంసలు

జిల్లాలో విశేష సేవలందించిన పలువురికి గణతంత్ర దినోత్సవం సందర్భంగా శుక్రవారం అవార్డులు ప్రదానం చేశారు. జిల్లా కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్, ఎస్పీ జి.ఆర్.రాధిక చేతుల మీదుగా పురస్కారాలు అందుకున్నారు.
– శ్రీకాకుళం (పీఎన్ కాలనీ)




కలెక్టర్ శ్రీకేష్ బి లాఠకర్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న చేనేత, జౌళి శాఖ ఏడీ వీరఘట్టపు ధర్మారావు



అదుపు తప్పి లోయలో పడిన బైక్

- యువకుడి మృతి.. మరొకరికి గాయాలు


గోపాల్ (ఫైల్)

కంచిలి: బైక్ అదుపు తప్పి లోయలో పడిన ఘటనలో యువకుడు మృతి చెందగా, మరొకరు గాయపడ్డారు. శుక్రవారం కంచిలి మండలం మండపల్లి పంచాయతీ రియా నారాయణపురం గ్రామానికి చెందిన జన్ని గోపాల్(26) తన స్నేహితుడు దశ్య చూడామణి ద్విచక్ర వాహనం వెనుక కూర్చొని వెళుతుండగా నారాయణపురం నుంచి కత్తివరం గ్రామానికి వెళ్లే మార్గంలో టర్నింగ్‌లో అదుపుతప్పి లోయలో పడ్డారు. ఈ ఘటనలో గోపాల్ తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. దయానిధి తీవ్ర గాయాలపాలయ్యాడు. క్షతగాత్రుడ్ని సోంపేట సీహెచ్‌సీలో చేర్పించారు. గోపాల్ తండ్రి నీలాంబర్ చిన్నప్పుడే మృతిచెందగా, తల్లి మోహిని కూలిపనిచేస్తూ పోషించింది. పెద్ద కుమారుడు కూలిపనిచేస్తుండగా, చిన్న కుమారుడు గోపాల్‌ను ఇంజినీరింగ్ చదివించింది. చేతికందిన కొడుకు మృతిచెందడంతో తల్లి కన్నీరు మున్నీరుగా విలపించింది. ఎస్‌ఐ ఎస్.బాలరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


లోయలో పడి మృతిచెందిన జన్ని గోపాల్

ఆలస్య రుసుంతో ఇంటర్ పరీక్ష ఫీజు గడువు పెంపు

శ్రీకాకుళం న్యూకాలనీ : వివిధ కారణాలతో ఇంటర్మీడియెట్ పరీక్ష ఫీజు చెల్లించలేని విద్యార్థులకు ఇంటర్‌బోర్డు మరో అవకాశం కల్పించింది. రూ.3వేల ఆలస్య రుసుంతో ఈనెల 29వ తేదీ వరకు ఆన్‌లైన్/నెట్ బ్యాంకింగ్ ద్వారా పరీక్ష ఫీజు చెల్లించే వెసులుబాటును ఇంటర్మీడియెట్ బోర్డు కల్పించిందని జిల్లా ఆర్ఐఓ పి.దుర్గారావు పేర్కొన్నారు. పరీక్ష ఫీజును యథావిధిగా చెల్లిస్తూ రూ.3వేల ఆలస్య రుసుంను కలుపుకొని మొత్తం ఫీజుగా చెల్లించాల్సి ఉంటుందని ఆర్ఐఓ స్పష్టం చేశారు. ఇంకా ఫీజు చెల్లించని విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ సీఐల బదిలీ

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లా ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ (రెవెన్యూ) విభాగానికి సంబంధించి ఇన్‌స్పెక్టర్లకు స్థానచలనం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఎం.ఇందుమతి అనకాపల్లి (ఏపీఎస్‌బీసీఎల్) నుంచి ఎచ్చెర్ల డిపో (ఏపీఎస్‌బీసీఎల్), కె.లక్ష్మి చినబ్రహ్మ దేవపురం నుంచి ఎచ్చెర్ల ఐఎంఎల్ డిపో, కె.సూర్యకుమారి శ్రీకాకుళం ఏపీఎస్‌బీసీఎల్ రోమో నుంచి అనకాపల్లి రోమో ఐఎంఎల్ డిపోకు, ఎస్‌వి రమణమూర్తి శ్రీకాకుళం రోమో ఏపీఎస్‌బీసీఎల్ నుంచి డిస్టిలరీ వింగ్‌కు, కేవైఎస్‌బిర్‌కుమార్ శ్రీకాకుళం ఏసీ విజిలెన్సు వింగ్ నుంచి డిస్టిలరీ వింగ్‌కు బదిలీ అయ్యారు.

రోడ్డు ప్రమాదంలో ట్రాక్టర్ డ్రైవర్ మృతి


శంకర్ (ఫైల్)

నరసన్నపేట: మడపాం టోల్‌గేట్ వద్ద జాతీయ రహదారిపై శుక్రవారం వేకువజామున గుర్తు తెలియని వాహనం ఢీకొని లావేరు మండలం కేశవరాయునిపాలెంకు చెందిన బుజ్జి శంకర్ (43) మృతి చెందాడు. సొంతంగా ట్రాక్టర్ నడుపుకుంటున్న శంకర్ మడపం నుంచి సర్వీ కర్రల లోడుతో చిలకపాలెం వైపు బయలుదేరాడు. టోల్‌గేట్ వద్ద ఆగి టీ తాగి తిరిగి వెళ్తుండగా నరసన్నపేట వైపు నుంచి శ్రీకాకుళం వైపు వెళ్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో శంకర్ అక్కడికక్కడే మృతిచెందాడు. ఈయనకు భార్య లక్ష్మి, ఇద్దరు కుమార్తెలు, తల్లిదండ్రులు పద్మనాభం, లక్ష్మమ్మ ఉన్నారు. ఎస్‌ఐ ఏ.సింహాచలం ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. టోల్‌గేట్ వద్ద సీసీ కెమోరాలు ఉన్నా ప్రమాద సమయంలో దురుగా వాహనాలు నిలపడంతో ప్రమాదానికి కారణమైన వాహనం వివరాలు రికార్డు కాలేదు. కాగా టోల్‌గేట్ వద్ద నిత్యం వాహనాలు ఇష్టానుసారంగా నిలిపివేస్తుండటంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి.

'మాజీ సైనికుల సంక్షేమ సంఘం ఎన్నికలు చెల్లవు'

శ్రీకాకుళం:

జిల్లా వ్యాప్తంగా 7,500 మంది మాజీ సైనికులు ఉన్నారని, ఇటీవల కొంతమంది మాజీ సైనికుల సంఘం పేరుతో నిర్వహించిన ఎన్నికలు చెల్లవని జిల్లా సైనికుల జాయింట్ యాక్షన్ కమిటీ ప్రతినిధులు పైడి రామారావు, ఎస్.ఎస్.మూర్తి, ఎస్.రామారావు, కె.వెంకటరమణ అన్నారు. శ్రీకాకుళంలో శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల్లో 400 మంది మాత్రమే హాజరు కావడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రజాస్వామ్యబద్ధంగా త్వరలో ఎన్నికలు నిర్వహిస్తామని, మాజీ సైనికుల గుర్తింపు కార్డు కలిగిన ప్రతిఒక్కరూ ఓటు వినియోగించుకోవాలని కోరారు. సమావేశంలో సీహెచ్ అమ్మాజీ, జి.పురుషోత్తంరావు, పైడి మధు, ఎ.వి.ఆర్.మూర్తి, ఎల్.నిరోషా పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మాజీ సైనికులు

ఉపాధ్యాయుడికి సన్మానం

ఎచ్చెర్ల క్యాంపస్: కొత్తపేటకు చెందిన గురుగుబెల్లి కృష్ణ అనే ఉపాధ్యాయుడు ఫరీదుపేట ఉన్నత పాఠశాలలో ఫిజిక్స్ స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. కొత్తపేట ఉన్నత పాఠశాల ఆవరణలోని మర్రిచెట్టు చుట్టూ రూ.2 లక్షలతో సిమ్మెంట్ సిటింగ్ ప్లాట్‌ఫారం నిర్మించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు శుక్రవారం ఉపాధ్యాయ దంపతులను సన్మానించారు.